క్లుప్తంగా

నగదు ప్రోత్సాహకం అందజేత



నగదు అందజేస్తున్న ఎంపీటీసీ శంకరరావు దంపతులు

సంతకవిటి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి, ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు పి.పావని, కె.జగన్‌మోహన్‌రావు, సీహెచ్ కావ్యలకు ఎంపీటీసీ పొట్నూరు శంకరరావు దంపతులు రూ.10 వేలను నగదు ప్రోత్సాహకంగా మంగళవారం అందజేశారు. ఉన్నత చదువుల్లోనూ బాగా రాణించి, ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.సాయిశ్వరి, ఉపాధ్యాయులు బి.వరహాలనాయుడు, పి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్డీ పర్యటన



మున్సిపల్ కమిషనర్‌కు సూచనలిస్తున్న మున్సిపల్ ఆర్డీ నాగరాజు

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ ఆర్డీ నాగరాజు మంగళవారం పర్యటించారు. అక్కడి పారిశుధ్యం పరిస్థితులపై ఆరాతీశారు. ప్రతీ ఇంటి నుంచి సేకరిస్తున్న చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి, ఎరువు తయారు చేసి రైతులకు అందజేయాలని తెలిపారు. అనంతరం రామందొరవలసలోని కంపోస్ట్ యార్డును సందర్శించి, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మికి పలు సూచనలు చేశారు. చెత్త నుంచి సంపద తయారు చేసేలా ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని తెలిపారు. ఆయన వెంట పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వితరణ



స్కూల్‌బ్యాగు, నోటుపుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, స్కూల్‌బాగులను ఉపాధ్యాయులు మంగళవారం వితరణ చేశారు. ఆర్థికంగా బాగున్న వారు ఏమీ లేని వారికి తమవంతు సాయం అందివ్వాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణదాస్, ఉపాధ్యాయులు వై.మోజేష్, సన్యాసిరావు పాల్గొన్నారు.

నీటిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలో నీటిపన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు సూచించారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయంలో వార్డు సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదని, మున్సిపాలిటీలో బకాయిలతో రూ.2.80 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.30 లక్షలు మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. మూడేళ్లుగా ఆన్‌లైన్ చేయని కారణంగా వసూళ్లు నిలిచిపోయాయని, ప్రస్తుతం ఆన్‌లైన్ కావడంతో వినియోగదారులు కూడా సహకరించి పన్ను చెల్లించాలని కోరారు. సచివాలయ కార్యదర్శులు కూడా సంబంధిత వ్యక్తులకు పన్ను చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. ఇకనుంచి ప్రతీవారం నీటిపన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించనున్నామన్నారు.

గ్రామసభలు నిర్వహించండి

రాజాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీన తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మంగళవారం సమావేశమైన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా అదేరోజు ఈ గ్రామసభలు జరుగుతాయని, కేవలం ఉపాధి పనుల గుర్తింపు నిమిత్తం జరుగుతున్న ఈ సభల్లో రైతులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. సమావేశంలో ఏపీవో సాయిరాం, ఈసీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ నెల 23వ తేదీన సర్పంచ్ అధ్యక్షతన జరిగే గ్రామసభల్లో ఉపాధి హామీ పనుల గుర్తింపు చేపట్టాలని, అవి కూడా ప్రజోపయోగకరంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో త్రివిక్రమ్, చిన్నప్పయ్య పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఈవోపీఆర్డీ వెంకటరమణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో త్రినాధరావుతో కలిసి ఉపాధి హామీ పథకం సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రజాసంక్షేమం విస్మరిస్తే సహించం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వంగర: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో ప్రభుత్వ విధానాలకు తాము వ్యతిరేకం కాదని, రాజకీయం పరంగా ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తే సహించబోమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకుల విషయంలో తొలగింపులు, వేధింపులు, రాజకీయ కక్ష సాధింపులు చేయవద్దని సూచించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలతో న్యాయం చేయడం జరిగిందన్నారు. చిరుద్యోగులపై కూడా ఎలాంటి కక్ష సాధింపులు లేవన్నారు. గ్రామైక్య సంఘాల నియామకాన్ని పారదర్శకంగా చేపట్టాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాల బిల్లులు అర్హులకే చెల్లించాలన్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించుకుని, ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధైర్యపడొద్దని, అన్నింటా మనమే ఉన్నామని, సమష్టిగా ముందుకు సాగాలని, అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.

శాఖల వారీగా సమీక్ష..

అనంతరం శాఖల వారీగా సమీక్షించారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో ఏవో కన్నబాబును ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు నిలదీశారు. ఈ ఏడాది ఆర్‌బీకేల ద్వారా తగినంతగా ఎరువులు ఎందుకు సరఫరా కాలేదని, పూర్తిస్థాయిలో రైతులకు ఎరువులు ఇవ్వకుండా పొరుగుప్రాంతాలకు ఎందుకు దారిమళ్లించారని ప్రశ్నించారు. దీనిపై ఏవో సమాధానమిస్తూ కొంతమంది రైతులకు బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులు అందజేశామని, గతంతో పోలిస్తే యూరియా, డీఏపీ వంటి ఎరువులు రాలేదన్నారు. ఇకపై ఇటువంటి తప్పులు జరగకుండా చూసుకుంటామన్నారు. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో సంగాం ప్రాథమికోన్నత పాఠశాలలో త్రిమెన్ కమిటీ ఆమోదం లేకుండా మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకులను తొలగించడంపై ఎంఈవో ప్రవీణ్‌కుమార్‌ను సభ్యులు ప్రశ్నించారు. కోనంగిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని, పెండింగ్ గృహ నిర్మాణాల బిల్లులు చెల్లించాలని సర్పంచ్ చందక తాతబాబు కోరారు. జలజీవన్ మిషన్ సమీక్షలో భాగంగా పెండింగ్ పనులు చేపట్టిన అనంతరం మిగిలిన గ్రామాలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చరణ్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా మహిళలకు రుణాలు ఇచ్చి, వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యమని ఏపీఎం చక్రపాణి అన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టిన వారికి పెండింగ్ బిల్లుల మంజూరులో ఎందుకు తాత్సారం వహిస్తున్నారని ఏఈ పైడితల్లిని సభ్యులు అడిగారు. విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈగా మూడున్నరేళ్లు విధులు నిర్వహించిన కోనూరు వినయ్‌కుమార్ చేసిన సేవలను సభ్యులు అభినందించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ పున్నాన సత్యనారాయణ, మండల విప్ తెంటు కుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో లోపింటి త్రినాథ్, డీటీ బూరాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి



నినాదాలు చేస్తున్న దళిత ఉద్యోగ సంఘ నాయకులు



రాజాం సిటీ: బంద్‌కు పిలుపునిస్తూ పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

వంగర: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో బుధవారం చేపట్టే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని దళిత ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై పునఃసమీక్ష జరగాలని కోరుతూ వారు మండల కేంద్రంలో మంగళవారం నినాదాలు చేశారు. దళిత, బహుజన సంఘాల జేఏసీ పిలుపు మేరకు బంద్ చేపట్టడం జరుగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీల ఐక్యతను దెబ్బతీసేలా రాజకీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, దీనిపై మనమంతా నినదించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగ సంఘ నేతలు, డీటీ బి.సుందరరావు, ఆర్ఐ జె.మురళీ, వీఆర్‌వోలు గొండేల రాజు, చింతాడ సునీల్‌కుమార్, చిలక రాంబాబు, దళిత సేన రాష్ట్ర కార్యదర్శి ఎం.గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 8 గంటలకు..

రాజాం సిటీ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపడుతున్న భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని రాజాం నియోజకవర్గ జేఏసీ సభ్యులు మంగళవారం పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల దళితులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బంద్‌కు సహకరించాలని విద్యాసంస్థలు, పోలీసులకు వినతిపత్రాలు అందించామన్నారు.

నరేంద్ర దబోల్కర్ సేవలు శ్లాఘనీయం



దబోల్కర్ సేవలను కొనియాడుతున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

రాజాం సిటీ: మూఢనమ్మకాలను పారద్రోలుతూ శాస్త్రీయవిజ్ఞానం పెంపొందించేందుకు డాక్టర్ నరేంద్ర దబోల్కర్ చేసిన సేవలు శ్లాఘనీయమని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శాసపు సత్యనారాయణ కొనియాడారు. జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా మండలంలోని పొగిరి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దబోల్కర్ చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1989లో మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలనా సమితిని దబోల్కర్ స్థాపించి, మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం ఆమోదానికి విశేషమైన కృషి చేశారని తెలిపారు. దేశ వ్యాప్తంగా హేతువాద ఉద్యమాన్ని చేపట్టి అనేకమంది శాస్త్రవేత్తలను, వైద్య నిపుణులను, సామాజిక కార్యకర్తలను ఒక వేదికపై తీసుకు రావడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. మూఢనమ్మకాలను విడనాడి, వాటిని పారద్రోలడమే దబోల్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు జె.నీలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బందిని ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: ఉపాధి హామీ పథకం పనుల్లో అవగాహన లోపంతో ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు జరిగితే వాటిని పెద్ద తప్పులుగా భావించి సిబ్బందిని ఇబ్బందులు పెట్టవద్దని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీ భాస్కరరావు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఆడిటర్లు చేసిన సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)పై ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలంతా సోషల్ ఆడిట్ నివేదికలు చదివి వినిపించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ గతేడాది జరిగిన ఉపాధి హామీ పనులు, పింఛన్ల పంపిణీలో సిబ్బంది అవగాహన లోపం కారణంగా చిన్నచిన్న తప్పులు జరిగినవే తప్ప ఎక్కడా పెద్దగా అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెల వరకు జరిగిన పనులకు సంబంధించి ఈ ఆడిట్ చేయగా, మండలంలో దాదాపు 1234 వరకు చెరువులు, కాలువలు, ఇళ్లు, తదితర పనులు చేయగా, మరో 70 వరకు సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల పనులు జరిగాయన్నారు. వీటి కోసం రూ.18,89,34,916 నిధులు ఖర్చు అయ్యాయని, అలాగే గడిచిన ఆరు నెలల వ్యవధిలో 8,708 సామాజిక పింఛన్ల కోసం రూ.13,77,77,000 ఖర్చు జరిగినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీడీ జనార్దనరావు, డీవీవో వెంకటేశ్వరరావు, ఏపీడీ శ్రీనివాసరావు, డ్వామా అధికారి భానుజీరావు, సీసీ మనోహర్, ఎస్ఆర్‌పీ లక్ష్మణరావు, ఎంపీడీవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పారాది వంతెన పరిశీలన



పారాది బ్రిడ్జి పరిస్థితిపై ఆరాతీస్తున్న ఎస్ఈ విజయరత్నం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది వంతెనను ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం మంగళవారం పరిశీలించారు. బ్రిడ్జి కుంగిపోయినట్లు తెలుసుకున్న ఎస్ఈ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి, వంతెన పరిస్థితిని గమనించారు. కొత్త వంతెన నిర్మాణానికి అనువైన ప్రదేశం, నిర్మాణానికి అవసరమైన నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను డీఈ జనార్దన్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం రేపు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న సీతారామా థియేటర్ పక్కన మారుతీ సప్లయర్స్ మేడపై ఈ నెల 22వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల రాజాం సంఘ అధ్యక్షుడు నారాయణశెట్టి గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. విజయనగరానికి చెందిన శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బందిచే అన్ని రకాల కంటి పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలపతి చలించాడు..



మృతదేహాన్ని భుజాలపై వేసుకుని మోసుకు వెళ్తున్న కానిస్టేబుల్ చలపతి

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ సమీపంలోని తోటపల్లి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అటువైపుగా వెళ్తున్న కానిస్టేబుల్ చలపతి చూసి, చలించిపోయాడు. అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకు వెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో తన భుజాలపై ఆ మృతదేహాన్ని వేసుకుని, దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరం మోశాడు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు



వంగర: రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్



రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

తెర్లాం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని తెర్లాం చిన్నయ్యపేటలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన.. తొలుత విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత, నోటు పుస్తకాలు, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలు, మరుగుదొడ్లు, తాగునీటి వనరులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల వర్క్‌బుక్‌లలోని ప్రతీ పదాన్ని ఉపాధ్యాయులు చూసి, దిద్దాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి, విద్యార్థులకు పెట్టాలన్నారు.

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామ పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు బాగున్నాయని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన తొలుత పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.సుందరీమణి, ఉపాధ్యాయులు బి.చంద్రమౌళి, పి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంపీ ప్రసాదరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత ఉపాధ్యాయుల డైరీలు, లెస్సన్‌ప్లాన్‌లు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురపాక వెంకటరమణ పాల్గొన్నారు.

హమ్మయ్యా.. గొయ్యి పూడ్చారు..!

సాక్షి ఎఫెక్ట్



తెర్లాం రామమందిరం జంక్షన్ మలుపు వద్ద కల్వర్టు గొయ్యిని పూడ్చివేస్తున్న దృశ్యం

తెర్లాం: తెర్లాం–బొబ్బిలి ఆర్అండ్‌బీ రోడ్డులోని స్థానిక రామ మందిరం జంక్షన్ మలుపు వద్ద ప్రమాదకరంగా తయారైన కల్వర్టు గొయ్యిని మంగళవారం పూడ్చారు. దీంతో అటువైపుగా వెళ్తున్న వాహనదారులు హమ్మయ్యా ఇప్పటికైనా గొయ్యి పూడ్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే గొయ్యి కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 17వ తేదీన సాక్షి దినపత్రిలో కల్వర్టు బాగుచేయరూ.. అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావు స్పందించారు. ఆయన తన సొంత నిధులతో గొయ్యిని పూడ్చివేయించి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలు యథావిధిగా జరగడంతో అందరూ ప్రమాదం తప్పిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇదే సమస్య పరిష్కారానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమంటున్నారు.

నిరసన ర్యాలీ



నినాదాలు చేస్తున్న కూటమి నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది

బొబ్బిలి: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనలకు వ్యతిరేకంగా స్థానిక పట్టణంలో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కోట దగ్గర నుంచి సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్) వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పలు కళాశాలల విద్యార్థులు, కూటమి నేతలు పాల్గొని, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. విచారణను సత్వరం చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి, బీజేపీ ఇన్‌చార్జ్ మరిశర్ల రామారావు పాల్గొన్నారు.

రాజాం సిటీ: కోల్‌కతాలో ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బొబ్బిలి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. అనంతరం ఆ పార్టీ నాయకుడు పి.సురేష్ మాట్లాడుతూ మెడికోపై జరిగిన ఘటన చాలా బాధాకరమని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థి ప్రతిభ

బాడంగి: రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మరడాన ప్రసన్న విశేష ప్రతిభ కనబరిచింది. శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి, జట్టు ప్రథమ స్థానంలో నిలవడంలో కీలక పాత్ర పోషించారని ఆ పాఠశాల పీడీ బంగారునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థిని అందరూ అభినందిస్తున్నారు.

సీబీఎం పాఠశాలను కొనసాగించాల్సిందే..



పాఠశాల కొనసాగించాలని అధికారులను కోరుతున్న విద్యార్థి తల్లి

బొబ్బిలి: పట్టణంలో చారిత్రాత్మకమైన సీబీఎం బాలికోన్నత పాఠశాలను కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కరస్పాండెంట్ రత్నాకర్ పాఠశాల స్థలాన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడన్న ఆరోపణలు, పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, సీబీఎం చర్చి ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో పాఠశాలలో డిప్యూటీ ఈవో మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇక్కడి స్కూల్‌కు గుర్తింపు లేదని, పిల్లలను వేరేచోట పాఠశాలల్లో చేర్పించాలని డిప్యూటీ ఈవో పిల్లల తల్లిదండ్రులకు తెలిపారు. తమ పిల్లలను ఇక్కడి నుంచి వేరే పాఠశాలకు పంపే ప్రసక్తే లేదని, పాఠశాలను కొనసాగించాల్సిందేనని స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చిచెప్పారు. రత్నాకర్ కావాలనే సమావేశాలకు హాజరుకావడం లేదని, స్కూల్ గుర్తింపు కూడా రెన్యువల్ చేయడం లేదని ఆరోపించారు. ఆయనపై 11 క్రిమినల్ కేసులు ఉన్నాయని, అలాంటి వ్యక్తిని స్కూల్ కరస్పాండెంట్‌గా ఎలా నియమించారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమావేశానికి హాజరైన ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నేతలు డిప్యూటీ ఈవో, ఎంఈవోలతో వాగ్వాదానికి దిగారు. ఎప్పటిలాగే స్కూల్‌ను నడిపించాలని కోరారు. చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే ఈ పాఠశాల మూతపడకుండా చూడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వి.విజయగౌరి, క్రిస్టియన్ సంఘ నాయకులు కె.అదృష్టకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులంతా కలిసి డిప్యూటీ ఈవోకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎంఈవోలు లక్ష్మణరావు, వాసు, ప్రధానోపాధ్యాయులు సునేత్రి, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం



రామభద్రపురం: బూసాయవలసలో ఆవుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

రామభద్రపురం: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని, ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పశు వైద్యాధికారిణి హిరణ్య అన్నారు. మండల వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుందని, నాలుక, పళ్లచిగుళ్లపై నీటి కురుపులు ఏర్పడి చితికిపోవడంతో ఆ పశువులు మేత తినడం మాని వేస్తాయని, నోటి నుంచి నురగ కారుతుందని, నడవడానికి కూడా ఇబ్బంది పడతాయని తెలిపారు. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి, పునరుత్పత్తి సామర్థ్య బాగా తగ్గిపోతాయన్నారు. వ్యాధి రాకముందే ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచిదన్నారు. సెప్టెంబరు 18వ తేదీ వరకు ఈ టీకాలు వేయనున్నామన్నారు. రైతు సేవా కేంద్రాలు, పశు వైద్యశాలల్లో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెర్లాం: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు సోకకుండా టీకాలు దోహదపడతాయని మండల పశు వైద్యాధికారి జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. విజయరాంపురం, పెరుమాళి తదితర గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, కాసేపు మాట్లాడారు. పశువులు వ్యాధి బారినపడకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. విజయరాంపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బి.మధుసూదనరావు, పెరుమాళిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి ఎస్.అప్పలనరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు బాగుచేయాలని డిమాండ్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, కార్యకర్తలు

రోడ్ల అధ్వానంపై ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నేతలు, కార్యకర్తలు వినూత్నంగా నిరసన తెలిపారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని పూల్‌బాగ్ రోడ్డులోని ఓ పెద్దగుంతలో నిలిచిన బురద నీటిలో కూర్చొని మరీ మంగళవారం ఆందోళనకు దిగారు. అధికారంలోకి రాగానే రోడ్లు వేస్తామని చెప్పిన కూటమి నేతలు ఎక్కడని నిలదీశారు. చాలాసేపు వారు అలాగే రోడ్డుపై ఉండిపోవడంతో అదే దారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నాయకులు వచ్చి హామీ ఇచ్చినంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. మున్సిపల్ మేనేజర్ జి.ఎం.శివప్రసాద్, ఏఈ రవి తదితరులు అక్కడికి చేరుకుని, వారం రోజుల్లోగా రోడ్డు మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి కదిలారు.

–బొబ్బిలి